సాక్షి
నల్లగొండ
ఆదివారం । 2 ఏప్రిల్ । 2023



పథకాలను అడ్డుకుంటున్న రాష్ట్రం
కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రం అడ్డుకుంటోందని మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి పద్మజా మీనన్ ఆరోపించారు. - 10లో



అవినీతి, లంచగొండి పార్టీ బీజేపీ
కేంద్రంలోని బీజేపీ అవినీతి, లంచగొండి పార్టీ అని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
37° / 24°
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4-46 (సోమవారం ఉదయం)

ఖజానాకు 'కిక్కు'

- లక్ష్యాన్ని మించి వసూలు చేసిన ప్రధాన శాఖలు
- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 7.56 శాతం మేర వృద్ధి
- రూ.160.92 కోట్ల అదనపు ఆదాయం
- మద్యం ద్వారా ప్రభుత్వానికి అధిక రాబడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. జిల్లాలో అధిక ఆదాయం సమకూర్చిన శాఖల్లో ఎక్సైజ్ శాఖ మొదటి స్థానంలో ఉండగా.. తర్వాత స్థానంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉంది. రవాణా శాఖ మూడో స్థానంలో ఉండగా, భూగర్భ గనుల శాఖ (మైనింగ్) నాలుగో స్థానంలో నిలిచింది. 2021-22 ఆర్థిక సంవత్సరంతో జిల్లాలో ఆయా శాఖల ద్వారా ప్రభుత్వానికి రూ. 2126.05 కోట్ల ఆదాయం సమకూరగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అవే శాఖల ద్వారా రూ.2286.97 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో ప్రభుత్వం విధించిన లక్ష్యానికి మించి ఆదాయం సమకూర్చిన జాబితాలో నల్లగొండ జిల్లా చేరింది. మొత్తానికి జిల్లాలోని నాలుగు ప్రధాన శాఖలు రూ.160.92 కోట్లు (7.56శాతం) అదనపు ఆదాయాన్ని రాబట్టాయి.

శాఖల వారీగా ఆదాయం వివరాలు (రూ.కోట్లలో)..

శాఖ	2021-22	2022-23	పెరుగుదల	శాతం
ఎక్సైజ్	1,532.93	1,622.37	89.44	5.83
రిజిస్ట్రేషన్స్	412.15	453.99	41.84	10.15
ట్రాన్స్‌పోర్ట్	133.75	148.28	14.53	10.86
భూగర్భగనులు	47.22	62.33	15.11	31.99
మొత్తం	2,126.05	2,286.97	160.92	7.56.

ప్రభుత్వ ఆదేశాలతో టార్గెట్‌పై దృష్టి
జిల్లాలోని ఎక్సైజ్ శాఖతోపాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ, మైనింగ్ కార్యాలయాలు వారికి ఇచ్చిన లక్ష్యానికి మించి ఆదాయాన్ని సమకూర్చాయి. కచ్చితంగా ఇచ్చిన టార్గెట్ చేరుకోవాల్సిందేనన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా శాఖల అధికారులు పని చేయాల్సి వచ్చింది. తద్వారానే లక్ష్యానికి మించి ఆదాయాన్ని రాబట్టగలిగారు.

అదనపు ఆదాయంలో ఎక్సైజ్ శాఖ టాప్..
ఎక్సైజ్ శాఖ అంతకుముందు సంవత్సరంతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరంలో రూ.89.44 కోట్లు (5.83 శాతం) అదనంగా ఆదాయాన్ని సాధించగలిగింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రూ.41.84 కోట్లు (10.15 శాతం), రవాణా శాఖ రూ.14.53 కోట్లు (10.86 శాతం) అదనంగా వసూలు చేసింది. భూగర్భ గనుల శాఖ రూ. 15.11 కోట్లు అధిక ఆదాయాన్ని సాధించింది. అదనపు ఆదాయం శాతాల వారీగా చూస్తే మాత్రం భూగర్భ గనుల శాఖ 31.99 శాతం అదనపు ఆదాయాన్ని రాబట్టింది.

రామయ్య రథోత్సవం



నల్లగొండ పట్టణంలోని లోని రామాలయం వద్ద సీతారాముల రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి తదితరులు

'ఉదయ సముద్రం' భూ సేకరణకు రూ.22 కోట్లు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం బ్రహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు భూ సేకరణ కోసం రూ.22 కోట్లు మంజూరు చేయించినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిరేకల్ ప్రాంత ప్రజల కలల ప్రాజెక్టు ఉదయ సముద్రం పూర్తికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేయించి వీలైనంత తొందరగా సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. నిధులను మంజూరు చేసిన ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



పోషకాహారం ప్రదర్శనను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : బాలికలు పౌష్టికాహారం తీసుకొని రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త వహించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో రక్తహీనతపై క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రక్తహీనతపై బాలికలకు పలు సూచనలు చేశారు. బాలికలకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సుభద్ర, సీడీపీఓ నిర్మల, సూపర్‌వైజర్ ప్రణీత తదితరులు ఉన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ : ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారికి వాటిని క్రమబద్ధీకరించేందుకు ఈనెల 30వ తేదీలోగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములపై క్రమబద్ధీకరణ, హక్కులు బదిలీ చేసేందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాల్లో 125 గజాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి అభ్యంతరం లేని భూములకు జీఓ 58 ద్వారా ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి హక్కులు కల్పించనున్నట్లు తెలిపారు. 125 గజాల కంటే ఎక్కువ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి దరఖాస్తులను విచారించి మార్కెట్ రేటు ప్రకారం ఫీజు తీసుకుని క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

చండూరు(గట్టుప్పల) : బీసీ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించే హలో బీసీ-చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దోటి సైదులు, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్వకేట్ గంగనబోయిన రాంబాబు, గట్టుప్పల్ సర్పంచ్ ఇడెం రోజా, పూర్ణాచారి, ఆంజనేయులు, నరసింహా, వెంకటేశం, కట్ట స్వామి, సత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా తేల్చాలి

మునుగోడు : కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్ర వాటా ఎంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణాజలాల వాటా విషయంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు ఈ నెల 14 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, బొల్లూరి నర్సింహా, చాపల శ్రీను, బి.లాలు, కై లాస్‌గౌడ్, పాండు, యాదయ్య, సత్తమ్మ, వనం వెంకన్న, బీరప్ప, లింగస్వామి, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పక్కన ఎస్పీ అపూర్వరావు తదితరులు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతులను ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 5న బాబు జగ్జీవన్ రామ్, 11న జ్యోతిరావుపూలే, 14న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అపూర్వరావుతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ యువజన, విద్యార్థి సంఘాలతోపాటు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో ఎక్కడా లోటుపాట్లకు తావు లేకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం తరపున అవసరమైన ఆహ్వానాలు, వేదికలు, టెంట్లు, సౌండ్ సిస్టం, విగ్రహాల వద్ద పూల అలంకరణ, పూలదండలు, కుర్చీలు, తాగునీరు, మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ జయంతి ఉత్సవాలకు పోలీస్ శాఖ నుంచి బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సల్మాబాను, బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు బొర్ర సుధాకర్, చొల్లేటి ప్రభాకర్, కత్తుల షణ్ముఖ్, కొండేటి వెంకట్, పాలడుగు నాగార్జున, నూనె వెంకటస్వామి, గోలి ఏడుకొండలు, పెరిక ఉమామహేశ్వర్, బకరం శ్రీనివాస్, చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, పెరిక సంహితరాణి, కత్తుల మహేశ్వర్, కత్తుల జగన్, రంగాపూర్ యాదయ్య, కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకన్న, మారుపాక నరేందర్, రవీందర్, సైదులు పాల్గొన్నారు.

రెండేళ్ల కాలపరిమితితో పొదుపు పథకం

రామగిరి(నల్లగొండ) : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మహిళలు, బాలికల కోసం 2025 మార్చి వరకు రెండేళ్ల కాలపరిమితితో కేంద్రం మహిళా సమ్మాన్ పొదుపు పథకం అమలు చేస్తోందని తపాలా శాఖ నల్లగొండ డివిజన్ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద డబ్బులు పొదుపు చేసుకున్న వారికి 7.5 శాతం వడ్డీ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపారు.

బండి సంజయ్‌కి నేతల స్వాగతం



ఏబీవీపీ జాతీయ మాజీ కార్యదర్శి కడియం రాజు కుటుంబాన్ని పరామర్శించేందుకు మిర్యాలగూద మండలం కొత్తగూడెం వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి తదితరులు

పక్కాగా భూగర్భ జలాల లెక్క

- కొనసాగుతున్న జలగణన
- తొమ్మిది శాఖల సహకారంతో క్షేత్రస్థాయిలో నీటి లభ్యతపై సర్వే
- ఇక నుంచి ప్రతి సంవత్సరం సర్వే నిర్వహించేలా ప్రణాళిక
- కలెక్టర్ అధ్యక్షతన గ్రౌండ్ వాటర్ కోఆర్డినేషన్ కమిటీ నియామకం



మర్రిగూడ మండలం శివన్నగూడెంలో నీటి లభ్యతను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నల్లగొండ : జిల్లాలో భూగర్భ జలాల లభ్యత ఎంత ఉంది? ప్రజలు ఎంత వినియోగిస్తున్నారు? జలాలు ఎంత పెరుగుతున్నాయి? భావితరాలకు ఎంత అవసరం కాబోతున్నాయి? అనే విషయంపై జల గణన జిల్లాలో కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో రెండేళ్లకు ఒకసారి జల గణన చేపట్టేవి. తద్వారా నీటి వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నందున ఇక నుంచి ప్రతి సంవత్సరం నీటి గణన చేపట్టాలని నిర్ణయించాయి. ఈ జలగణనతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జలాలను ఏమేరకు వినియోగించుకోవాలి అనే దానిపై అంచనాలు వేయనున్నారు.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ నియామకం..
2022-23 భూగర్భ జల సర్వేలో భూగర్భజల శాఖతోపాటు ముఖ్య ప్రణాళిక, వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఎస్పీడీసీఎల్, ఉద్యాన, రెవెన్యూ, మిషన్‌భగీరథ తదితర శాఖలు పాల్గొననున్నాయి. జిల్లా కలెక్టర్ గ్రౌండ్ వాటర్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా, భూగర్భజల శాఖ అధికారి కన్వీనర్‌గా, మిగిలిన శాఖల అధికారులను సభ్యులుగా నియమించారు. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి తాగునీరు, వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు ఏమేరకు నీటికి వినియోగిస్తున్నారనే విషయంపై సర్వే చేపడుతున్నారు. దీంతో నీటి లభ్యత, వినియోగంతోపాటు భూగర్భ జలాలు ఎంత లోతులో ఉన్నాయనేది తేలనుంది.

నాలుగు రకాలుగా నీటి నిల్వ గుర్తింపు..
ప్రస్తుతం ఆయా శాఖల ఆధ్వర్యంలో జల సర్వే కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 32 మండలాల పరిధిలో సర్వే నిర్వహిస్తారు. ఉదాహరణకు ఒక గ్రామంలో నీటి లభ్యత 100 లీటర్లు ఉంటే 70 లీటర్ల వరకు అక్కడ వివిధ అవసరాల కోసం వినియోగిస్తే 30 శాతం నీటి నిల్వ ఉంటుంది. ఇలాంటి గ్రామాలను నీటి సురక్షిత గ్రామాలుగా పిలుస్తారు. 70శాతం నుంచి 90 శాతం వరకు నీటి వినియోగించే గ్రామాలను సెమీ క్రిటికల్ గ్రామాలుగా, 90 నుంచి 99 శాతం వరకు నీటిని వినియోగించే గ్రామాలను క్రిటికల్ గ్రామాలుగా పేర్కొంటారు. నీటి లభ్యతను మించి నీటిని వినియోగించే గ్రామాలను అధిక నీటి వినియోగం గ్రామాలుగా పేర్కొంటారు.

జలగణనతో ముందు జాగ్రత్త



"జల గణన కొనసాగుతోంది. గతంలో రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగేది. ఈ సంవత్సరం నుంచి ఏటా నిర్వహిస్తాం. జల గణన ద్వారా నీటి లభ్యత ఎంత ఉంది.. అవసరాలకు ఎంత వినియోగిస్తున్నాం.. మిగులు జలాలు ఎంత అనేది తేలుతుంది. దీని ద్వారా నీటిని పొదుపు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.
– టి.సునీల్ బాబు, డీడీ భూగర్భ జలశాఖ

నీటి లభ్యత అంచనా ఇలా..
భూగర్భజల శాఖ అధికారులు నీటి నిల్వలపై అంచనాలు వేస్తున్నారు. వర్షాపాతం, ఆనకట్టలు, చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి లభ్యత ఎంత? బోర్లు, బావులను తాగునీటి కోసం ఎంత వాడుకుంటున్నారన్నది తేలుస్తారు. ప్రజలు గృహ అవసరాలు కోసం ఎంత నీటిని వినియోగిస్తున్నారు. పరిశ్రమలకు ఎంత నీరు అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి ఎంత వినియోగిస్తున్నారు.. అనేది ఆయా శాఖల ప్రగతి నివేదికల ఆధారంగా అంచనా వేస్తారు. సర్వే పూర్తయిన తర్వాత జిల్లాలో నీటి లభ్యత ఎంత.. ఏమేరకు వినియోగిస్తున్నారు.. ఎంత నీరు మిగిలి ఉంది.. భవిష్యత్ తరాలకు నీటికి అందించాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రజలను చైతన్యం చేయనున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి



పాల్గొన్న ఎంపీ లింగయ్యయాదవ్, సభ్యులు

నల్లగొండ : ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన 1,2,4,5,6,7 స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లతోపాటు డ్రెయినేజీలు నిర్మిస్తున్నందున మురుగు నీరు పంట పొలాలకు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో మెటీరియల్ కాంపోనెంట్ వచ్చే విధంగా చూడాలన్నారు. స్త్రీ నిధి రుణాలు సంఘంలోని అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అంది వారికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా ఆయా స్థాయీ సంఘాల చైర్మన్లు, సభ్యులు పలు సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, స్థాయీ సంఘం చైర్మన్ స్వరూపారాణి, కంకనాల ప్రవీణ, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల జాడేదీ!

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వెలువడని ప్రకటన
- దొడ్డు ధాన్యాన్ని కల్లాల్లోనే రాశులు పోస్తున్న రైతులు
- సమీక్షలు నిర్వహిస్తున్న అధికారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది దామరచర్ల మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు. ఈ మార్కెట్‌కు 20 రోజులుగా రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 20 వేల బస్తాల ధాన్యం వచ్చింది. రోజూ ఉదయం వడ్లను ఆరబెట్టి.. సాయంత్రం రాశి పోస్తున్నారు. ధాన్యం తెచ్చిన రోజు నుంచి పట్టాల కిరాయి వారికి భారంగా మారుతోంది. పొద్దంతా రైతులు రాశుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వర్షం వస్తే కనీసం వారికి టార్పిలిన్లు ఇచ్చే వారు కూడా లేరు. కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇదీ జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి.

నల్లగొండ అగ్రికల్చర్, మిర్యాలగూడ : యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా నాటు వేసిన పొలాలు కోతకు రావడంతో రైతులు వాటిని యంత్రాలతో కోత కోయిస్తున్నారు. సన్న రకం ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లుల్లో విక్రయిస్తుండగా.. దొడ్డు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శుక్రవారం అదనపు కలెక్టర్ అధికారులు, మిల్లర్లతో సమావేశమై కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని సూచించారు. శనివారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కానీ, ఎప్పటి నుంచి కేంద్రాలు ప్రారంభించే విషయాన్ని స్పష్టం చేయలేదు.

5,56,802 ఎకరాల్లో వరి సాగు..
జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 5,56,802 ఎకరాల్లో వరి సాగైంది. అందులో దొడ్డురకం 4,64,840 ఎకరాల్లో సన్నాలు 91,962 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. దొడ్డురకం 11.52 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 2.21 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని.. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు అంచనా వేశాయి. సన్నరకం ధాన్యాన్ని మాత్రం రైతులు కొంత ధాన్యం తినడానికి ఉంచుకోవడం, మిగిలిన ధాన్యాన్ని మిల్లర్లు, వ్యాపారులకు విక్రయించుకుంటారు. దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. ఈ సీజన్‌లో ఐకేపీ 140, పీఏసీఎస్ 138 మొత్తంగా 278 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు సుమారు రెండు కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా 1.20 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. కానీ కొనుగోళ్ల ప్రారంభించే తేదీ మాత్రం చెప్పడం లేదు.

కేంద్రాల్లో రాశులు పోస్తున్న రైతులు
వరికోతలు ప్రారంభమైనప్పటికీ జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు కోసిన ధాన్యాన్ని పొలాల వద్దనే కుప్పలు పోసుకుటున్నారు. మరికొన్ని ప్రాంతాలలో గత వానాకాలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల స్థలంలోనే రాశులు పోస్తున్నారు. 15 రోజులుగా కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో ధాన్యం పెద్ద ఎత్తున కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. వర్షాలు వస్తే కనీసం టార్పాలిన్లు కూడా లేవని ఆందోళన చెందుతున్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పడిగాపులు కాస్తున్నాం..



"15 రోజుల క్రితం మార్కెట్‌కు ధాన్యాన్ని తొసుకొచ్చా. రోజు ఇక్కడ పడిగాపులు కాస్తున్నా. అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. కనీసం టార్పాలిన్లు ఏర్పాటు చేయలేదు. ఇక్కడికి వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– లావూరి సాలి, రైతు, దామరచర్ల

కొనుగోళ్లు ప్రారంభిస్తాం



"ఈ నెల రెండో వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వరికోతలు సాగుతున్నాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.
–శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

ఒకరి దుర్మరణం

కోదాడరూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన భుక్యా రామ(60) శుక్రవారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్‌పై ఓ పనినిమిత్తం కోదాడకు వస్తున్నాడు.ఈ క్రమంలో మార్గ మధ్యలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో తొలుత కోదాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు సీతరాంనాయక్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవింగ్ చేస్తున్న శాంతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

మఠంపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని అల్లీపురం గ్రామ సమీపంలో గల ఉప్పలమ్మ ఆలయంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చివరన ఉన్న ఉప్పల మైసమ్మ ఆలయంలోకి శుక్రవారం రాత్రి దుండగులు చొరబడ్డారు. హుండీని పగులగొట్టి రూ.5వేల నగదును అపహరించుకుపోయారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే, ఈ ఆలయంలో చోరీ జరగడం నాలుగోసారి అని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఇసుక టిప్పర్‌ల పట్టివేత

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్‌లను కోదాడ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. నందిగామ సమీపంలో గల నాగల్లు ఇసుక క్వారీ నుంచి అనుమతి పత్రాలు లేకుండా హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌లను సీజ్ చేసి డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. మండలంలోని బొమ్మాయిపల్లికి చెందిన కొంపల్లి శివ(19) గత నెల మార్చి 25న స్నిగ్ధ కాలనీ నుంచి వస్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న శివ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

యాదాద్రి కొండపై భక్తులకు కష్టాలు





యాదాద్రి కొండపై ఎండ వేడికి బండలపై పరుగులు తీస్తున్న భక్తులు

- ఎండవేడికి తట్టుకోలేక పరుగులు
- ఆలయ పరిసరాల్లో కానరాని ఉపశమన చర్యలు

సాక్షి, యాదాద్రి : వేసవి కాలం భానుడి భగభగలు ప్రారంభంతోనే యాదాద్రికొండపైకి వచ్చిన భక్తులు ఉరుకులు పరుగులు పెట్టక తప్పడంలేదు. దేవస్థానానికివస్తున్న వేలాది మంది భక్తులు ఎండకు తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. రాతికొండపై కృష్ణ శిలలతో నిర్మించిన నూతన దేవాలయం ప్రాంగణం అంతా భగభగమండిపోతోంది. ఉదయం 11 గంటల నుంచే ఫ్లోరింగ్ బండల నుంచి వేడి సెగలు భక్తులను పరుగులు పెట్టిస్తున్నాయి. రూ.150 టికెట్‌తో శీఘ్ర దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులకు నిలువ నీడ లేకుండాపోయింది. ఆలయంలో శ్రీ స్వామి దర్శం పూర్తి చేసుకుని బయటకు వచ్చిన ఫ్లోరింగ్ బండలపై నడిచే భక్తుల కాళ్లు కాలుతున్నాయి. వృద్ధులు వేగంగా నడవలేక అరికాళ్లు కమిలిపోతున్నాయి. దూరంగా ఉన్న ప్రసాదాల విక్రయం వద్దగల నీడ కోసం పరుగులు తీస్తున్నారు. కొండపైన విశాలమైన స్థలం ఉన్నా కనీసం చలువ పందిళ్లు వేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకు ఆయా శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, మిల్లర్లు, గ్రామీణాభివృద్ధి, సహకార, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులతో యాసంగి ధాన్యం సేకరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 278 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా అందులో పీఏసీఎస్ 140, ఐకేపీ 138 కేంద్రాల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి శాఖ, సహకార శాఖ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. తూకం, తేమ యంత్రాలు, గన్నీలు, ప్యాడీ క్లీనర్‌లు, టార్పాలిన్‌లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గన్నీ బ్యాగులు పౌర సరఫరాల సంస్థ వద్ద 71 లక్షలు, మిల్లర్ల వద్ద 50 లక్షలు మొత్తం కోటీ 21 లక్షలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా సహకార అధికారి రాజేందర్ రెడ్డి ,జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారిణి సుచరిత, ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి సన్నద్ధమవుతాం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొల్ల కురుమలకు గొర్రె పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ, వివిధ పథకాలపై పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పథకాల అమలు తీరును వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ భాగస్వామ్యం అభినందనీయం

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి



రెడ్‌క్రాస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అందించిన సహకారం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహారెడ్డి, డైరెక్టర్లు కె.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ఎన్.చారి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డిలను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రెడ్‌క్రాస్ సొసైటీలకు రక్త సంబంధం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి, స్టడీ సర్కిల్ కన్వీనర్ తొర్ర ఉప్పలయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, పెన్షనర్స్ సంఘం జిల్లా కోశాధికారి యామగాని బుగ్గయ్య, యూటీఎఫ్ మండలాల నాయకులు మొగుళ్లపల్లి సోమయ్య, వారాల యాదగిరి, బందారపు దుర్గాప్రసాద్, దర్శనం వెంకన్న, దోర్నం వెంకన్న, సత్తయ్య, కేజీవీబీ కన్వీనర్ రేఖ, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు చాతరాశి అంజయ్య, జె.రవికుమార్, దడిపెల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో ..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి జిల్లా చైర్మన్‌గా రెండవసారి మోత్కూరు నుంచి ఎన్నికైన గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డిని శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం నాయకులు జంగ శ్రీను, పురుగుల మల్లయ్య, పురుగుల వెంకన్న, వెంకటనర్సు, అవిశెట్టి స్వామి, జంగ నాగరాజు, అవిశెట్టి సోమయ్య, అవిశెట్టి వెంకన్న, పురుగుల భిక్షం, పురుగుల మల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కొండమడుగులోని ఫార్మా కంపెనీలో పేలుళ్లు

- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ పరిధి కోజీపార్క్ సమీపంలోని గ్యాస్ట్రిక్ ట్యాబ్‌లెట్స్ తయారయ్యే సిన్స్టాన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు పేలుళ్లు సంభవించాయి. పరిశ్రమలో రోజువారీగా ట్యాబ్‌లెట్స్ తయారీ పనులు జరుగుతుండగా రాత్రి ముగ్గురు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పరిశ్రమ బయట కొండమడుగు గ్రామానికి చెందిన నగేష్‌తో పాటు మరో కార్మికుడు బానోతు మహేష్ వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా పరిశ్రమలో పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల ధాటికి బయట విధులు నిర్వహిస్తున్న నగేష్, మహేష్‌లపై ఇటుకలు, రేకు ముక్కలు ఎగిరిపడడంతో గాయపడ్డారు. వారిద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో ఉన్న ముగ్గురు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు.

ఎయిర్ లీక్ కాకపోవడంతోనే..

ట్యాబ్‌లెట్స్ తయారీ సమయంలో రన్నింగ్‌లో ఉండే మిషనరీలకు ప్రెషర్ గ్యాస్ లీకేజీల నుంచి ఎయిర్ బయటకు వెళ్లకపోవడంతో పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది. కాగా ప్రమాదానికి గల కారణం గురించి పరిశ్రమ మేనేజర్‌ను అడగగా ఎయిర్ బయటకు రాకపోవడంతోనే దాని ప్రెషర్ ఎక్కువై పేలుడు జరిగి ఉంటుందని తెలిపారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గ్రామస్తుల ఆందోళన

ప్రమాదకరమైన పరిశ్రమలను ఎత్తివేయాలని, వీటి వలన ముప్పు పొంచి ఉందని గ్రామస్తులు పరిశ్రమ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

క్యాన్సర్ బాధితుడికి కోమటిరెడ్డి ఆర్థికసాయం

- నిరుపేద యువకుడికి ఆపరేషన్ చేయించిన భువనగిరి ఎంపీ
- రూ.50వేలు అందజేత



రవీందర్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కోమటిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు

కనగల్: చిన వయస్సులో లోగ్రేడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడికి ఆపరేషన్ చేయించడంతో పాటు వ్యక్తిగత సహాయకుడితో రూ.50వేల నగదు పంపి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రవీందర్ 29ఏళ్ల వయస్సులోనే క్యాన్సర్ బారిన పడ్డాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. భార్య దివ్యాంగురాలు కాగా మూడు, ఐదు ఏండ్ల లోపు కూతుళ్లు ఉన్నారు. ఆరు నెలల నుంచి రవీందర్ లోగ్రేడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని కోఠి కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంపీ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి రవీందర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఆపరేషన్ చేయించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి రవీందర్ పూర్తిగా కోలుకునే దాకా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. సహాయం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రవీందర్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో రెండు నెలల జైలు

శాలిగౌరారం: వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి నకిరేకల్ జేఎఫ్‌సీఎం కోర్టు రెండు నెలల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సతీష్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన భూపతి శ్రీనివాస్ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఈనేపథ్యంలో 2015 నవంబర్ 6న నిందితుడి భార్య శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ అయోధ్య కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నకిరేకల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్(జేఎఫ్‌సీఎం) కోర్టు న్యాయమూర్తి కావ్య నిందితుడికి రెండు నెలల జైలుశిక్ష, రూ.500లు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్ష పడే విధంగా పనిచేసిన అప్పటి విచారణ అధికారి విశ్రాంత సీఐ అయోధ్య, ప్రస్తుత శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్‌ఐ సతీష్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మణ్‌నాయక్, కోర్టు కానిస్టేబుల్ సతీష్‌లను నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

సూర్యాపేట క్రైం : గంజాయి విక్రేతను సూర్యాపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణంలోని సీతారామాపురం కాలనీకి చెందిన సాయినవీన్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. సాయి నవీన్ జనవరిలో పట్టుబడిన గంజాయి ముఠాలో సభ్యుడు. అయితే పోలీసుల నుంచి మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు శనివారం సీతారామపురం కాలనీలో సాయి నవీన్ నుంచి 250గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. అదే విధంగా సాయి నవీన్‌ను అదుపులోకి తీసుకునే సమయంలోపట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి కుమారుడితో పాటు మరో ఇద్దరిని పోలీసులు వదిలేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయాన్ని సీఐ రాజశేఖర్ కొట్టిపారేశారు.

యోగా సాధనతో ఆరోగ్యం



నల్లగొండలోని టీఎన్‌జీఓస్ భవనంలో శిక్షణ ఇస్తున్న యోగా గురు

నల్లగొండ టూటౌన్ : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని యోగా గురూజీ సంధ్య పేర్కొన్నారు. పోషణ పక్వాడలో భాగంగా శనివారం నల్లగొండ పట్టణంలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, నిత్యం పని ఒత్తిడితో ఉండే అవకాశం ఉన్నందున యోగా సాధన చేసి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం యోగా గురూజీ సంధ్యను జిల్లా స్త్రీ సంక్షేమ శాఖ అధికారి సుభద్ర ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ నిర్మల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలో వస్తేనే సమస్యలు పరిష్కారం

మిర్యాలగూడ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్ర శనివారం దామరచర్ల మండలంలోని కేశవాపురం, రామోజితండా, మాస్‌తండా, దనియాలతండాలో కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాలి కాంతారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీను, సర్పంచ్ జనార్దన్‌నాయక్ పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి

చిట్యాల : సమస్యల పరిష్కారానికి కార్మికులంతా సంఘటితంగా పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి చంద్రం పిలుపునిచ్చారు. చిట్యాలలో శనివారం జరిగిన ఆ సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘంలో కార్మికులంతా సభ్యత్వాన్ని పొందాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వేయి కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల పట్టణానికి చెందిన పాల భిక్షంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తొట్ల పరశురాములు, మంచాల గణేష్, పాల నర్సింహ, చింతకింది విజయ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నకిరేకల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నకిరేకల్: ఔషధాలు, టోల్‌గేట్ల వద్ద చార్జీల పెంపును నిరసిస్తూ శనివారం నకిరేకల్‌లో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అంబటి చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు రాయితీలిస్తూ పేద ప్రజలపై పన్నుల భారం మోపడం తగదన్నారు. ఔషధాల రేట్లను 12 శాతానికి పెంచడం దారుణమన్నారు. పెంచిన రేట్లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చెరుకు సైదులు, బుడిగె శ్రీను, పసుపులేటి సోమయ్య, బొడ్డు శ్రీను, శేఖర్, అంబటి నవీన్, రాములు, కొప్పుల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కూతుళ్లు భరోసా ఇచ్చినా..

- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేక ఆర్‌ఎంపీ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణం
- మృతుడు అర్వపల్లి వాసి

తొర్రూరు: 'నాన్నా.. మేము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తాం. మీరేమీ బాధపడొద్దు. ఎటువంటి అఘాయిత్యం చేసుకోవద్దు' అని ఇద్దరు కూతుళ్లు భరోసా ఇచ్చారు. అయినా అతని మనస్సు వినలేదు. అప్పులతో కుటుంబాన్ని ఇబ్బంది పెట్టొద్దని భావించిన ఓ ఆర్‌ఎంపీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



జమాలుద్దీన్(ఫైల్)

సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన ఎండీ జమాలుద్దీన్ (46) కొన్నేళ్ల క్రితం తొర్రూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంతో పాటు మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు మదీనా, రిజ్వానా ఉన్నారు. మదీనా డిగ్రీ పూర్తికాగా, రిజ్వానా ఇటీవల ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసింది. వారి విద్య, ఇంటి అవసరాల నిమిత్తం రూ.15లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో చావే శరణ్యమని తలచాడు. కుటుంబంతో సైతం పలు మార్లు ఈ విషయంపై తన ఆవేదనను వెల్లిబుచ్చగా తాము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తామని కూతుళ్లు భరోసానిచ్చారు. తీసుకున్న అప్పు, వడ్డీలు కట్టలేనని భావించి, కుటుంబాన్ని ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి బయటికి వచ్చిన జమాలుద్దీన్ అర్ధరాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. భార్య ఫోన్‌కు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మెసేజ్ చేశాడు. ఆందోళన చెందిన భార్య పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా శనివారం ఉదయం స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలో విగత జీవిగా కనిపించాడు. మృతుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య గౌసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేసవిలో పశువుల యాజమాన్యం కీలకం

- నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ అఖిల సూచనలు



వల్లాపురంలో ఆవుల మంద

పాడి పంట

నడిగూడెం : ఇప్పటికే వేసవి కాలం ప్రారంభమైంది. ఈ మూడు నెలలు పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించి, ఆయా సీజన్‌లలో ఎదురయ్యే ప్రతికూల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశుపోషణ, పాడి అభివృద్ధికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్.బి.అఖిల చెబుతున్న సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే......

పాటించాల్సిన మెళకువలు

ఎండుగడ్డిని రాత్రి లేదా చల్లని వేళల్లో వేయాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు వేస్తే గడ్డిని జీర్ణం చేసుకొనే ప్రక్రియలో పశువుల ఒత్తిడికి గురై ఆయాస పడతాయి. సాధారణంగా వేసవిలో ఘనరూపంలో మేతను మామూలుకన్నా తక్కువగా తీసుకుంటాయి. అందువల్ల ఎక్కువ పోషక విలువలున్న మేతను సమీకృత దాణా ఇవ్వాలి. వేసవిలో పచ్చి మేత లభించేలా ముందస్తు చర్యలు చేపట్టాలి. లేదంటే మొలక గడ్డి రూపంలో ఉండేలా చేసుకోవాలి.వేసవిలో ఖనిజ లవణాల అవసరం ఎక్కువగా ఉంటుంది. రోజూ 60గ్రాముల ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించాలి. వరి గడ్డిని మేతగా వాడే వారు అందులో పోషక విలువలు కలిపేలా చర్యలు తీసుకోవాలి. పచ్చిమేతలను, ఎండుగడ్డిని ముక్కలుగా చేసి మేపడం వలన గడ్డి వృథాకాకుండా నివారించవచ్చు. అయోడైజ్డ్ ఉప్పును దాణాతో పాటు ఇవ్వాలి. పాడి పశువులకు వేసవిలో చల్లటి శుభ్రమైన తాగు నీరు ఎక్కువసార్లు ఇవ్వడం వలన వేడిని తగ్గించవచ్చు. అందుబాటులో ఉంటే పశువులను రోజుకు రెండు మూడు సార్లు కడిగితే మేలు.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నది. వేసవిలో పశువులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా సంకర జాతి, జెర్సీ రకాల ఆవులు 37 డిగ్రీల ఉష్ణోగ్రతకే ఇబ్బందులు పడతాయి. శరీర ఉష్ణోగ్రత పెరిగి వేడిని అదుపులో ఉంచుకోవడానికి నోటి ద్వారా శ్వాసతీసుకుంటూ ఆయాస పడతాయి. ఈ సమయంలో మేత కూడా తక్కువగా తీసుకుంటాయి. దీని వలన పాల దిగుబడి కూడా తగ్గుతుంది. నల్లరంగు ఉండే గేదెలు ఎండ వేడికి మరింత ఇబ్బంది పడతాయి. వడదెబ్బకు గురికావడం, జ్వరం రావడం లేదా శరీరంలో నీటి శాతం తగ్గిపోయి, మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుంది.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నది. ఒక వేళ ఆవులకు, గేదెలకు అగ్ని ప్రమాదంలో చిన్న చిన్న దెబ్బలు తగిలినా ప్రమాదమే. అలా జరిగిన రెండు మూడు రోజుల్లోనే చనిపోయే అవకాశాలు ఎక్కువ. పశువులు ఉండే పాకలు, ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను నియంత్రించే ఏర్పాట్లు చేసుకోవాలి. పాక కాస్తంతా ఎత్తుగా ఉంటే వేడి తక్కువగా ఉంటుంది.తాటాకులు, భోద లాంటి వాటితో పాకకు కప్పి అప్పుడప్పుడు నీటితో తడపాలి. వేడి ఉక్కబోత ఎక్కువగా ఉన్నప్పుడు చల్లని నీడనిచ్చే చెట్ల క్రిందే పాకలు వేయాలి. చల్లని చెట్ల కిందనే పశువులను కట్టేయాలి.ఉష్ణోగ్రతను ఎంత తగ్గిస్తే అంత మేతను పశువుల తింటాయి. వడదెబ్బ తగిలితే పశువైద్యులను వెంటనే సంప్రదించాలి.